

సోమశిలలో 61.025 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 61.025 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,830 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.88,730
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,025
3 శాతం జీఎస్టీతో	రూ.8,266
నవర (8 గ్రా)	రూ.66,128

గరిష్ఠం/కనిష్ఠం
33.3 /24.0

వాతావరణం

శనివారం జిల్లాలో వాతావరణం సాధారణంగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 65 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

గ్రూపు–2 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- డీఆర్వో ఉదయభాస్కర్‌రావు



మాట్లాడుతున్న డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఆదివారం ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూపు–2 మెయిన్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేశామని డీఆర్వో ఉదయభాస్కర్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 10.3 నుంచి 12.30 గంటల వరకు పేపర్–1 పరీక్ష, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాలో 7 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం శని, ఆదివారాల్లో అందుబాటులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల సమాచారం, అడ్రస్, ఇతర విషయాల కోసం 0861– 2331261 నంబరులో సంప్రదించాలన్నారు.

వెబ్‌సైట్‌లో ఇంటర్ హాల్ టికెట్లు

నెల్లూరు (టౌన్): ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లను అందుబాటులో ఉంచినట్లు ఆర్‌ఐఓ ఆదూరు శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. https@// bie. ap. gov. in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఆధార్ నంబరు, డేటా ఆఫ్ బర్త్ సహాయంతో మన మిత్ర వాట్సప్ నంబరు 9552300009 నుంచి కూడా హాల్ టికెట్ పొందవచ్చన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

- ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా



మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా

నెల్లూరు (అర్బన్): రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని సకాలంలో పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్ సిసోడియా సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రీసర్వే, రెవెన్యూ సదస్సులు, పీజీఆర్‌ఎస్, భూ ఆక్రమణలు, కోర్టు కేసులు తదితర అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరిస్తూ మళ్లీ అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రీ సర్వేలో కొలతల్లో చిన్న, చిన్న తేడాలుంటే రైతులను పిలిపించి నచ్చచెప్పి వీలున్నంత వరకు సరి చేయాలన్నారు. ఆక్రమణలకు గురైన భూములను తక్షణమే విడిపించాలన్నారు. రెవెన్యూ రికార్డులన్నీ డిజిటల్ చేయాలన్నారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ సేవలందించడంలో జాప్యం లేకుండా చూస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, సబ్ కలెక్టర్ పూజిత, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, ఆర్డీఓలు, జిల్లా సర్వే అధికారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరుకున్న మంత్రి మనోహర్



మంత్రికి బొకే అందించిన టిడ్కో చైర్మన్

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం సాయంత్రం నెల్లూరుకు చేరుకున్నారు. ఆయనకు రైల్వే స్టేషన్‌లో టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రంగయ్య స్వాగతం పలికారు. మంత్రి శనివారం ఉదయం 9 గంటలకు సంగం చేరుకుంటారు. అక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులతో ముఖాముఖి మాట్లాడుతారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నెల్లూరులో ధాన్యం సేకరణ, పీడీఎస్ బియ్యం పంపిణీపై సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారు.

జిల్లా అభివృద్ధికి కృషి

నెల్లూరు (పొగతోట): జిల్లాలో ఉన్న వనరులను వినియోగించి పూర్తిస్థాయిలో జిల్లాను అభివృద్ధి చేసేలా కృషి చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం జిల్లాకు చేరుకున్న మంత్రి నగరంలో ఏర్పాటు చేసిన ఫంక్షన్ హాల్లో కార్యకర్తలతో మాట్లాడారు. రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్నామన్నారు.

కళ్లు తెరిచారా.. కనికట్టు చేస్తున్నారా

తమ అక్రమ సంపాదన కోసం రాజకీయ నేతలు బరితెగించారు. ఇసుక అక్రమ రవాణా నిలువరించాల్సిన అధికారులు నేతల సేవలో, మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో విరువూరు, సూరాయపాళెం ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ రవాణాపై సంబంధిత అధికార యంత్రాంగం దాదాపు తొమ్మిది నెలల తర్వాత కళ్లు తెరిచింది. నిజాలు తెలుసుకుని కట్టడి చేస్తున్నారా? లేక నిష్పక్షపాతంగా వ్యవహస్తున్నామని కనికట్టు చేస్తున్నారా? లేక కోర్టు స్టే ఉన్న విరువూరు రీచ్ వ్యవహారం తమ మెడకు చుట్టుకుంటుందని భావించి ఇలా చేశారా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఏదిఏమైనా.. స్థానిక ప్రజాప్రతినిధి కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని అధికారులు బట్టబయలు చేయడం చూస్తుంటే.. ఇన్నాళ్లు ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు నిజమే అని తేటతెల్లం చేస్తున్నాయి.

- విరువూరు రీచ్‌పై స్టే ఉన్నా.. ఆగని ఇసుక దోపిడీ
- విరువూరు, సూరాయపాళెం రీచ్‌ల నుంచి యథేచ్ఛగా రవాణా
- సర్వేపల్లి ముఖ్య నేత కనుసన్నల్లోనే..
- మైనింగ్ డీడీ దాడులతో కూటమి నేతల ఉలికిపాటు
- ఇసుక లారీల సీజ్‌తో డీడీపై సదరు ముఖ్య నేత ఆగ్రహం



పెన్నానదిలో బావుల్లాంటి గోతులు పెట్టి ఇసుక లోడేసిన టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సర్వేపల్లిలో టీడీపీ నేతలు రీచ్‌ల్లో ఇసుక దోపిడీ చేస్తున్నట్లు మైనింగ్ శాఖ అధికారుల దాడుల్లో తేట తెల్లమైంది. అధికారమే అండగా తొమ్మిది నెలలుగా విరువూరు, సూరాయపాళెం ఇసుక రీచ్‌లను అడ్డాగా చేసుకుని తమ్ముళ్ల ఇసుక మాఫియా చెలరేగిపోయింది. నిబంధనలకు పాతరేసి ఇసుక తవ్వేసి జిల్లా సరిహద్దులు దాటిస్తూ ధనార్జన సాగిస్తున్నారు. విరువూరు ఇసుక రీచ్‌లో డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక తవ్వకాలకు అనుమతులు తీసుకున్నప్పటికీ దీనిపై కోర్టు స్టే విధించింది. అయినప్పటికీ సంబంధిత శాఖల అధికారులు తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తూ అధికార పార్టీకి కొమ్ము కాస్తూ వచ్చారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు ఇసుక రీచ్‌ల వైపు కన్నెత్తి చూడకపోవడంతో నదీ గర్భాన్ని కుళ్లబొడిచేశారు. విరువూరు రీచ్ నుంచి రేయింబవళ్లు బయట జిల్లాలతోపాటు పక్క రాష్ట్రాలకు ఇసుక రవాణా చేస్తున్నా.. పట్టించుకునే అధికారి లేకుండా పోయారు. భూగర్భ జలాలు, కరకట్టలు దెబ్బతింటున్నా.. పెన్నాబ్యారేజీకి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని రైతులు చెబుతున్నా.. ఉచిత ఇసుకను నగదుగా మార్చి దోచుకుంటున్నారు.

ఇన్నాళ్లు తెలియదా? ఇప్పుడే కళ్లు తెరిచినట్లు!

గత తొమ్మిది నెలలుగా కోర్టు స్టే ఉన్న విరువూరు రీచ్ నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిన మైనింగ్ శాఖాధికారులు ఇప్పుడే కళ్లు తెరిచినట్లుగా ఆ రీచ్‌పై దాడులు చేయడం, ఇసుక తవ్వే యంత్రాలతోపాటు లారీలు, టిప్పర్లను సీజ్ చేయడం చూస్తుంటే అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. రెగ్యులర్ డీడీ లేని సమయంలో జిల్లా మైనింగ్ అండ్ జియాలజీ డీడీ (ఎఫ్ఏసీ) బాలాజీనాయక్ సాహసించి విరువూరు ఇసుక రీచ్‌లో ఇసుక అక్రమ రవాణా బండారాన్ని బయట పెట్టారు. అక్కడి నుంచి పోలీసులకు ఫోన్ చేసినా వారు స్పందించకపోవడంతో కలెక్టర్‌కు ఫోన్ చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తూ.. సీజ్ చేసిన వాహనాలను పోలీసులకు అప్పగించడం వెనుక చాలా కథే ఉన్నట్లు సమాచారం. సర్వేపల్లి ప్రజాప్రతినిధి ఇసుక దోపిడీకి కళ్లెం వేసేందుకు అధికారులే నడుం బిగించారా? లేక స్టే ఉన్న రీచ్‌లో ఇసుక దోపిడీపై రేపు కోర్టు ముందు నిలబడాల్సిన పరిస్థితులు ఉంటాయని జాగ్రత్త పడుతున్నారా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. నిజంగా కళ్లు తెరిచి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్నారంటే.. సూరాయపాళెం రీచ్ నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోకపోవడం చూస్తే.. ఇది కనికట్టుగానే ప్రజలు భావిస్తున్నారు. సరే ఏది ఏమైనా విరువూరు రీచ్ నుంచి ఇసుక దోపిడీ జరుగుతుందనే విషయం బహిర్గతమైంది. గత ప్రభుత్వంలో ఇసుక దోపిడీ చేశారంటూ నిరాధార ఆరోపణలు చేస్తూ వచ్చిన ఆ ప్రజాప్రతినిధి ఇప్పుడు సమాధానం చెప్పాలని డిమాండ్ వస్తోంది.

డీడీపై ముఖ్యనేత ఆగ్రహం

విరువూరు రీచ్‌లో మైనింగ్ డీడీ దాడులు చేసి కలెక్టర్‌కు తెలియజేస్తున్న సమయంలోనే ఇసుకాసురుడు నియోజకవర్గ ముఖ్య నేతకు ఫోన్ చేసి డీడీకి ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. కలెక్టర్‌తో మాట్లాడుతున్నానని.. మళ్లీ ఫోన్ చేస్తానని చెప్పినా వినిపించుకోలేదు. నా ఫోన్ కాల్ మాట్లాడకపోతే తాట వలుస్తా, బదిలీ చేయిస్తానంటూ సదరు ముఖ్య నేత ఊగిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. కలెక్టర్ ఆదేశాల మేరకే దాడులు చేశామని చెప్పినా ఆ నేత వినిపించుకోకుండా డీడీపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది.

సీసీ కెమెరాలు పెట్టి..

పొదలకూరు మండలం సూరాయపాళెం, విరువూరు ఇసుక రీచ్‌ల్లో విరువూరు రీచ్‌కు అనుమతి లేదు. కోర్టు స్టే ఉంది. అయినప్పటికీ ఈ రెండు రీచ్‌ల్లో సీసీ కెమెరాలు పెట్టి.. సమీపంలోనే కారులో నుంచే ఆపరేట్ చేస్తూ ఇసుక దోచుకుంటున్నారు. సర్వేపల్లి ముఖ్య నేత తన సొంతూరుకు చెందిన ఓ వ్యక్తి కనుసన్నల్లో రీచ్‌ను నడిపిస్తూ ఎవరికి చెందాల్సిన మామూళ్లు వారికి అందజేస్తున్నట్టు ప్రచారం ఉంది. ఈ రెండు రీచ్‌ల నుంచి నిత్యం 16 టైర్ల లారీల్లో సుమారు 75 వాహనాలకు పైగా నిత్యం 2,250 టన్నుల ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్క వాహనానికి రూ.10 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.



సోమిరెడ్డి ఇసుక దోపిడీ నిజమని తేలింది

పొదలకూరు మండలంలోని ఇసుక రీచ్‌ల ద్వారా సోమిరెడ్డి రూ.100 కోట్ల మేర ఇసుక దోపిడీకి ప్లాన్ చేశారని, మొదటి నుంచి చెపుతూనే ఉన్నాం. అధికారుల కళ్ల ముందే ఇసుక లారీలు వెళుతున్నా.. పట్టించుకోవడం లేదు. అధికారులు ఒక వేళ ఆపినా సోమిరెడ్డి అండదండలు ఉన్న కారణంగా లారీలు ఆగకుండా వెళ్లిపోయాయి. ఇప్పటికైనా అధికారులు రీచ్‌లో దాడి చేయడంతో ఇక్కడ దోపిడీ జరుగుతుందని ఈ జిల్లా ప్రజలకు తెలిసింది. సోమిరెడ్డి ఇసుక దోపిడీ నిజమని తేలింది. వాస్తవానికి సూరాయపాళెం, విరువూరు రీచ్‌ల్లో వందలాది లారీలు ఉన్నాయి. అధికారి వెళుతున్నాడనే సమాచారం తెలుసుకుని పంపించి వేశారు. దీన్ని బట్టి పరిశీలిస్తే సోమిరెడ్డి నీతి, నిజాయితీ ఎంతో తెలుస్తుంది.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి

విరువూరు రీచ్‌పై కోర్టు స్టే ఉంది

పొదలకూరు మండలం విరువూరు ఇసుక రీచ్‌పై కోర్టు స్టే ఉంది. ఈ రీచ్ నుంచి ఇసుకను తరలించేందుకు వీలు లేదు. పోతిరెడ్డిపాళెం, సంగం, సూరాయపాళెం ఇసుక రీచ్‌లను పరిశీలించి విరువూరు రీచ్‌లో లారీలను గమనించి తనిఖీ చేయడం జరిగింది. అక్కడ ఉన్న లారీలు, హిటాచీలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించాను. ఇక్కడి నుంచి ఎవరు ఇసుకను తరలించినా న్యాయస్థానాన్ని ధిక్కరించినట్లు అవుతుంది. – బాలాజీనాయక్, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ డీడీ, నెల్లూరు

మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్

- రైతుకు మద్దతు ధర కల్పించండి
- పనులు త్వరితగతిన పూర్తి చేయండి
- స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): రాబోయే వేసవి కాలంలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశాల్లో చైర్‌పర్సన్ మాట్లాడారు. జిల్లాలో మంచినీటి పథకాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇప్పటికే జెడ్పీ నుంచి రూ.14 కోట్ల నిధులు విడుదల చేశామన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న ఆర్‌ఓ ప్లాంట్లను ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ఆర్‌ఓ ప్లాంట్ల ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. వివిధ పనులకు సంబంధించి పూర్తి చేసిన బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతుందంటూ జెడ్పీటీసీలు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. చైర్‌పర్సన్ స్పందిస్తూ బిల్లులను సకాలంలో మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ధాన్యం ధరలు తగ్గిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ధాన్యానికి మద్దతు ధర కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మించి ధాన్యం కొనుగోలు చేసేలా ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి రోడ్డు పనులు వేగవంతం చేయాలని తెలిపారు. అందుబాటులో ఉన్న నిధులు ల్యాప్స్ కాకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం రాయితీలు ఇస్తుందన్నారు. ఆయా పథకాల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఇటీవల భోజనం సక్రమంగా లేదంటూ విద్యార్థులు ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకుంటున్నట్లు తెలుస్తుందన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలన్నారు. జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఉపాధి పనులు వేగవంతంగా జరిగేలా ఆయా శాఖల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ విద్యారమ, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు గౌతమ్‌రెడ్డి






గౌతమ్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రశేఖరరెడ్డి, విక్రమ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కిలివేటి

- నిష్పక్ష పాతిగా, అందరివాడుగా ఎదిగారు
- తృతీయ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి
- భారీగా తరలివచ్చిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు

నెల్లూరు (బారకాసు): దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా అందరివాడుగా, నిష్పక్ష పాతిగా, మచ్చలేని నాయకుడిగా ఎదిగారని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు కొనియాడారు. నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డు సెంటర్‌లోని మేకపాటి స్వగృహంలో శుక్రవారం ఆయన తృతీయ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌతమ్‌రెడ్డి చిత్రపటం వద్ద తల్లిదండ్రులు మాజీ ఎంపీ రాజమోహన్ రెడ్డి, మణిమంజరి దంపతులు, కుటుంబ సభ్యులు ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి బంధుమిత్రులు నివాళులర్పించారు. రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గౌతమ్‌రెడ్డి మరణం అత్యంత విషాదకరమన్నారు. తన కుమారుడు గౌతమ్‌రెడ్డి అకాల మరణం ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు తీరని లోటన్నారు. మూడేళ్లు అయినా ఆ బాధ నుంచి ఇంకా కోలుకోలేని పరిస్థితుల్లో ఉన్నామన్నారు.

గౌతమన్న ఆశయ సాధనకు కృషి చేస్తా: మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి


మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ గౌతమన్న ఆశయాలకు అనుగుణంగా ఎంజీఆర్ ఫౌండేషన్ ద్వారా ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. దివంగత మంత్రి గౌతమ్ రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో శ్రమించారని, వ్యవసాయ పరంగా, పారిశ్రామికంగా అన్నింటా నియోజకవర్గాన్ని ముందు స్థానంలో నిలబెట్టారన్నారు. మంత్రిగా మూడేళ్ల పాటు పదవిలో ఉన్నప్పటికీ 30 సంవత్సరాల పాటు ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకునేలా పారిశ్రామికాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రణాళికతో కూడిన అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ గౌతమ్‌రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. మాజీ మంత్రులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు గౌతమ్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలతోపాటు జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు భారీగా తరలివచ్చి గౌతమ్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకులు పలు కీర్తనలు ఆలపించారు.



గౌతమ్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో మేకపాటి, ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు, అభిమానులు

తమ్ముళ్ల గ'లీజు' దందా!

- మాలకొండలో 11 షాపులకు వేలం పాట
- మూడు షాపులను హెచ్చుపాటతో దక్కించుకున్న వ్యాపారులు
- ఎనిమిది షాపులకు నిలిచిన వేలం
- టీడీపీ నేతలకు కట్టబెట్టేందుకే నాటకీయ పరిణామాలతో వాయిదా



పర్యవేక్షణాధికారి బైరాగిని నిలదీస్తున్న వ్యాపారి

వలేటివారిపాళెం: మండలంలోని మాలకొండపై కొలువైన మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలోని దుకాణాలకు పలు నాటకీయ పరిణామాలతో వేలం ప్రక్రియ మరోసారి వాయిదా పడింది. టీడీపీ నేతలు గ'లీజు' దందాకు తెరతీశారు. దుకాణాల వేలానికి పాటదారులు రాలేదని చూపించి, నామినేషన్ పద్ధతిలో ఆ దుకాణాలను అతి చౌకగా కొట్టేయ్యాలనే కుతంత్రంతో టీడీపీ నేతలు వ్యాపారులను బెదిరించించినట్లు తెలుస్తోంది. దేవాలయ ప్రాంగణంలో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు 11 షాపులకు శుక్రవారం ఉప కార్యనిర్వహణాధికారి సాగర్ బాబు లీజు వేలం పాట నిర్వహించారు. బొమ్మల విక్రయాల షాపు –1 రూ.5 లక్షలకు, షాపు–2 రూ.4 లక్షలకు, హోటల్ రూ.10.30 లక్షలకు హెచ్చుపాట పాడి షాపులను దక్కించుకున్నారు. మిగిలిన ఎనిమిది షాపుల విషయంలో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. గతంలో వేలం పాట పాడుకున్న వ్యాపారులు పర్యవేక్షణ అధికారిగా వచ్చిన వై.బైరాగిని నిలదీశారు. 'గతంలో ఇన్‌చార్జి ఈఓగా దేవస్థానంలో పని చేశావు.. వ్యాపారులకు ఏం న్యాయం చేశావు, చెప్పిన మాటపై నిలబడకుండా అన్యాయం చేశావంటూ' నిలదీశారు. దీంతో గతం గతహః ఇప్పుడేంటో మాట్లాడాలని బైరాగి వ్యాపారులను దబాయించారు. మిగిలిన ఎనిమిది షాపులకు వేలం పాటలో పాల్గొనేందుకు వచ్చిన వ్యాపారులను అధికార పార్టీ నాయకులు బెదిరించడంతో ఎవరూ పాటలో పాల్గొనలేదు. డిపాజిట్ కట్టేందుకు వచ్చిన వ్యాపారులను పాట పాడుకుంటే వ్యాపారాలు ఎలా చేస్తారో చూస్తామంటూ హెచ్చరించడంతో వెనుదిరిగిపోయారు. దీంతో ఆ ఎనిమిది షాపుల వేలం పాట నిలిచిపోయింది.

మూడు సార్లు వేలం నిలిచిపోతే..

మూడు సార్లు వేలం పాట నిలిచిపోతే ఆ తర్వాత వేలం లేకుండానే నామినేషన్ పద్ధతిపై షాపులను దక్కించుకునేందుకే వేలం జరగనివ్వకుండా కుతంత్రాలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఎనిమిది పెద్ద షాపుల్లోనే వ్యాపారం భారీగా జరిగేవి కావడంతో ఓ పథకం ప్రకారం రెండో సారి కూడా వేలం పాటను వాయిదా వేయించారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. వేలం పాట విషయంలో ఇంత జరుగుతున్నా.. అంతా బైరాగిపై వదిలేసి ఉప కార్యనిర్వహణాధికారి సాగర్‌బాబు ప్రేక్షకపాత్ర వహించడం గమనార్హం. మాలకొండ దేవస్థానంలో వేలం పాట పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించాలంటే డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా ఒక ఈఓ, గతంలో ఈ దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా, ఇన్‌చార్జి ఈఓగా పనిచేసిన అధికారిని నియమించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పవిత్ర పుణ్యక్షేత్రంలో ఇలాంటి కుట్రలు చేయడంపై భక్తులు మండిపడుతున్నారు. బైరాగి పనిచేసిన కాలంలో ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అదే వ్యక్తిని పర్యవేక్షణ అధికారిగా నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రకృతి ఒడిలో..



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని నరసింహకొండ ప్రాంతం పచ్చదనాన్ని పరుచుకుని కోనసీమను తలపిస్తోంది. ఆహ్లాదకర వాతావరణం నడుమ జనం రాకపోకలు సాగిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

జీవన పోరాటం

భానుడు అస్తమిస్తున్న వేళ నెల్లూరు స్వర్ణాల చెరువులో ఇద్దరు వ్యక్తులు చేపల వేటను ముగించుకుని తిరుగు ప్రయాణం అవుతుండగా తీసిన చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఇప్పుడు ఓకే నా..



పగటి ఉష్ణోగ్రతలు నానాటికీ పెరుగుతున్నాయి. వేసవి తాపం వల్ల జీవాలకు ఇబ్బందులు మొదలయ్యాయి. కావలి – ఉలవపాడు మధ్య హైవేపై వాహనంలో తరలిస్తున్న కోళ్లపై నీళ్లు చల్లుతుండగా తీసిన చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

జీజీహెచ్‌కు అనారోగ్యం

జిల్లాకు రెఫరల్ ఆస్పత్రిగా ఉన్న నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో పాలన పడకేసింది. ఆస్పత్రికి పెద్ద దిక్కుగా ఉండాల్సిన సూపరింటెండెంట్ పదిరోజులు పనిచేస్తే మరో పదిరోజులు సెలవుపై ఉంటారు. అది కూడా అధికారికంగానా.. అనధికారికంగానో అర్థం కాని పరిస్థితి. సెలవుపై వెళ్లినా చెక్ పవర్ ఎవరికీ ఇవ్వకపోవడంతో ఆస్పత్రిలో ఏ చిన్న పని చేయాలన్నా రూపాయి ఖర్చు పెట్టలేని దుస్థితి నెలకొంది.

ఆరోగ్యశ్రీ రోగులకు చార్జీలు కూడా ఉద్యోగి జేబులో నుంచే..

- కనీస వసతులకు ఇబ్బంది పడుతున్న వైనం
- రెగ్యులర్ సూపరింటెండెంట్ సెలవుపై గందరగోళం
- డీఎంఈకి తెలియకుండానే..
- హెచ్‌డీఎస్ కమిటీ జోక్యంతో మూడురోజుల తర్వాత సమాచారం



జిల్లా సర్వజన ఆస్పత్రి

నెల్లూరు(అర్బన్): జీజీహెచ్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. తల్లీబిడ్డల (ఎంసీహెచ్) విభాగం వద్ద వెనుక వైపు సుమారు 2 నెలల క్రితం కుళాయి పైపు పగిలి నీరు వృథా అవుతుంది. ఇప్పటికే ఉష్ణోగ్రతలు పెరిగాయి. నీరు చాలదు. కేవలం రూ.1,000 ఖర్చు చేస్తే దానికి మరమ్మతులు చేయొచ్చు. అయినా నేటికీ దిక్కులేదు. ఆర్వో ప్లాంట్‌లో చిన్న మరమ్మతుల వల్ల నెలరోజులుగా ఎంసీహెచ్ విభాగంలో నీరు రాలేదు. సూపరింటెండెంట్ పట్టించుకోకపోవడంతో హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు తమ జేబులో నుంచి రూ.3 వేలు ఖర్చు చేసి వారం క్రితం ఆ ప్లాంట్‌ను రన్నింగ్‌లోకి తెచ్చారు. ఐపీ భవనంలోనూ నీటి సమస్య ఉంది. జనరేటర్‌కు డీజిల్ కావాలన్నా ఎవరో ఒకరి చేత ముందుగా ఖర్చు పెట్టిస్తారు. ఇక ఆ ఉద్యోగికి సకాలంలో డబ్బులు చెల్లించకుండా తిప్పుతూనే ఉంటారు. డాక్టర్లు పలుమార్లు తమ జేబులో నుంచి చిన్న, చిన్న మొత్తాలను ఖర్చుపెట్టుకుని సూపరింటెండెంట్ ఇవ్వకపోవడంతో మిన్నకుండి పోయారు.

ఆరోగ్యశ్రీ రోగులకు..

ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు పొందుతున్న రోగులు కనీసం 10 మంది పెద్దాస్పత్రి నుంచి ప్రతిరోజూ డిశ్చార్జి అవుతున్నారు. వీరికి చార్జీల కింద ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.150 వంతున చెల్లిస్తోంది. ఈ డబ్బును సూపరింటెండెంట్ ఆస్పత్రి ఖాతాలో నుంచి ఇవ్వాల్సి ఉంది. అయితే ఆయన సెలవుపై వెళ్లడం, ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తికి చెక్‌పవర్ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొద్దిరోజుల నుంచి ఓ ఉద్యోగి తన జేబులో నుంచి రోగులకు చార్జీల కింద నగదు ఇస్తున్నారు. సూపరింటెండెంట్ చెక్‌పవర్ ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని అధికారులు, డాక్టర్లు పేర్కొంటున్నారు.

పట్టించుకోకుండా..

రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ సిద్ధానాయక్ ఈనెల 15 నుంచి రెండు నెలలపాటు సెలవు పెట్టారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కి తెలియకుండా సెలవులోకి వెళ్లడంతో జీజీహెచ్‌లో గందరగోళం నెలకొంది. ఇప్పటికీ సెలవుల గురించి డైరెక్టర్ నుంచి అప్రూవల్ రాలేదని సమాచారం. వాస్తవానికి సెలవు పెట్టాలంటే ముందస్తుగా అడ్మినిస్ట్రేటివ్ అధికారి ద్వారా డీఎంఈ అనుమతి కోరుతూ లెటర్ పంపాలి. అయితే ఏ రోజూ అలా జరగలేదనే ప్రచారం ఉంది. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ నరేంద్రకు బాధ్యతలు అప్పగించారు. ఈయనకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తారని తెలిపారు. ఇంతలోనే అనుమానం వచ్చిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ (హెచ్‌డీఎస్) ఈనెల 17న సెలవులపై ఆరాతీసింది. కనీసం డీఎంఈకి సమాచారం లేదని తెలిసింది. ఈ విషయం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు తెలియకుండా రెగ్యులర్ సూపరింటెండెంట్ జాగ్రత్త పడ్డారు. దీంతో హెచ్‌డీఎస్ కమిటీ ఈ తతంగాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

రోగుల సమస్యలు పరిష్కరిస్తాం

రోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ఇన్‌చార్జిగా నాకు చెక్‌పవర్ లేదు. అయినా సర్దుబాటు చేసి ఆస్పత్రిలో కనీస వసతుల ఏర్పాటుకు కృషి చేస్తున్నా.

– డాక్టర్ నరేంద్ర, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

దీని గురించి తన అనుచరుల ద్వారా తెలుసుకున్న సిద్ధానాయక్ హడావుడిగా 18న డీఎంఈకి తమ సెలవులు గురించి అనుమతి కోరుతూ లెటర్ ఈ-మెయిల్ చేసినట్టు తెలిసింది. కాగా ఇంకా అనుమతి రాలేదని సమాచారం.

పరిశీలిస్తే..

సిద్ధానాయక్ చాలాసార్లు సెలవులు పెట్టినప్పటికీ అవన్నీ రికార్డుల్లో నమోదు కాలేదని ఆరోపణలున్నాయి. ఆయన బాధ్యతలు చేపట్టిన 2022 ఆగస్టు 4 నుంచి బయోమెట్రిక్, ఎఫ్ఆర్ఎస్ హాజరు పరిశీలిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ పెద్దాస్పత్రిలో సూపరింటెండెంట్‌గా అడిషనల్ డీఎంఈ హోదా కలిగిన సిద్ధానాయక్ మొదటి నుంచి ఎక్కువగా సెలవులు పెడుతున్నారు. ప్రతి శని, ఆదివారాలు ఇక్కడ ఉండరు. మిగతా రోజుల్లో ఎక్కువగా సెలవులు పెడుతుంటారు. రోజుకి 1,200 నుంచి 1,300కు పైగా ఓపీ ఉండే చోట పెద్దదిక్కుగా ఉండి సమస్యలు పరిష్కరించాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. ఇంత జరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. సిద్ధానాయక్ ఎప్పటికప్పుడు డీఎంఈ కార్యాలయంలో మేనేజ్ చేసుకుంటుండంతో పెద్దాస్పత్రిలో రోగులకు కనీస సౌకర్యాలు అందడం లేదనే విమర్శలున్నాయి.

క్లుప్తంగా

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ హాల్లో టీడీపీ నాయకుడు బీద రవిచంద్ర కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు ఈనెల 23న సీఎం చంద్రబాబు రానున్నారు. దీంతో ఎస్పీ జి.కృష్ణకాంత్ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం కలెక్టర్ ఒ.ఆనంద్, ఎస్పీ, ఇంటెలిజెన్స్ ఇతర శాఖల అధికారులతో కలిసి ఏఎల్ఎస్ (అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్)ను నిర్వహించారు. కనుపర్తిపాడు ఉన్నత పాఠశాలలోని హెలిప్యాడ్ నుంచి కన్వెన్షన్ సెంటర్, పార్కింగ్ ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా పరంగా తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు.

టెండర్ల ఆహ్వానం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు మూలాపేటలోని ఏపీ స్టార్స్‌లో శిక్షణకు హాజరయ్యే జైళ్ల శాఖ సిబ్బందికి భోజన సదుపాయం అందించేందుకు 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి గానూ అర్హులైన కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ స్టార్స్ ప్రిన్సిపల్ ఎస్.రాజారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ ధరావత్తు రూ.20,23,500లని వెల్లడించారు. టెండర్ దక్కించుకున్న వారు ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి 2026 మార్చి 31వ తేదీ వరకు భోజనం అందించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు మార్చి 4వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు టెండర్ల సీల్డ్ కవర్లను స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు ఏపీ స్టార్స్‌ను సంప్రదించాలని కోరారు.

సర్పంచ్ చెక్‌పవర్ రద్దు పొడిగింపు

పొదలకూరు: మండలంలోని ప్రభగిరిపట్నం సర్పంచ్ పి.వెంకమ్మ చెక్‌పవర్ రద్దును మరో ఆరునెలలపాటు పొడిగిస్తూ డీపీఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయం, సర్పంచ్‌కు వాటిని అందజేశారు.


గొలుసు దొంగ అరెస్ట్



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు


నెల్లూరు(క్రైమ్): ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆయాను మాటల్లో పెట్టి ఆమె మెడలోని బంగారు గొలుసును తెంపుకెళ్లిన ఘటనలో నిందితుడిని నెల్లూరు చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. గాంధీనగర్ సమీపంలోని వీఎంఆర్ నగర్‌లో సొంగ బుజ్జమ్మ, పుల్లయ్య దంపతులు నివాసం ఉంటున్నారు. బుజ్జమ్మ 15 ఏళ్లుగా మద్రాస్ బస్టాండ్ సమీపంలోని అహల్యా దేవి నర్సింగ్‌హోంలో ఆయాగా పనిచేస్తోంది. జనవరి 4వ తేదీ రాత్రి హాస్పిటల్‌కు వెళ్లింది. గుర్తుతెలియని యువకుడు వచ్చి బుజ్జమ్మతో మాటలు కలిపాడు. ఉన్నట్టుండి ఆమె మెడలోని 12 గ్రాముల బంగారు గొలుసును తెంపుకెళ్లాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు హిందీలో మాట్లాడుతున్నాడని ఆమె వెల్లడించారు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితుడు కొరడావీధిలోని గోల్డ్ స్మిత్ దుకాణంలో పనిచేస్తూ రాధామాధవి సెంటర్‌లో ఉంటున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజుగొరిగా గుర్తించారు. అతను శుక్రవారం బుజ్జమ్మ బంగారు గొలుసును విక్రయించేందుకు వెళ్తుండగా చిన్నబజారు వద్ద అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అయ్యప్ప, క్రైమ్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 93
లేయర్ (లైవ్) : 75
బ్రాయిలర్ చికెన్ : 170
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 190
లేయర్ చికెన్ : 127

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.48
సన్నవి : రూ.30
పండ్లు : రూ.22

విద్యుదుత్పత్తి కేంద్రాలుగా గృహాలు

- జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి అవకాశాలు
- 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న దినకర్, చిత్రంలో కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్

నెల్లూరు(పొగతోట): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటిని విద్యుదుత్పత్తి కేంద్రంగా మార్చాలని 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. నెల్లూరులోని నూతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. దీనికి శాసనసభ్యులు ఎవరూ హాజరుకాలేదు. అధికారులు మాత్రమే వచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మర్యాదపూర్వకంగా చైర్మన్‌ను కలిశారు. సమీక్ష అనంతరం దినకర్ మీడియాతో మాట్లాడారు. ఉపాధి హామీ, జల్‌జీవన్ మిషన్, అమృత్ పథకం తదితర అంశాలపై సమీక్షించామన్నారు. సత్ఫలితాలను సాధించేలా అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. జిల్లాను ఎలక్ట్రానిక్ హబ్‌గా, వస్తువులు తయారీ కేంద్రంగా మార్చడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ఇక్కడ అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. రామాయపట్నం పోర్టు చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

అవగాహన లేకుండానే..

అధికారుల సమీక్షలో దినకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల ఉపాధి హామీకి సంబంధించి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో రూ.2,300 కోట్లకు పైగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులను నష్టపోవడం జరిగిందన్నారు. వాస్తవానికి ఉపాధి పనులకు సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్ నిధులు ముందుగా మంజూరు కావు. ఒక జిల్లాను యూనిట్ తీసుకుంటారు. ఉదాహరణకు రూ.200 కోట్ల విలువైన పనులు జరిగితే రూ.80 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ నిధులు మంజూరవుతాయి. మిగతా మొత్తం కూలీలు చేసే పనులకు సంబంధించి ఇస్తారు. కలెక్టర్లు జిల్లాలో కూలీలు చేసే పనులను పరిశీలించి మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా సీసీ రోడ్లు, ఇతర భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తారు. ఈ విషయంపై అవగాహన లేని చైర్మన్ రూ.2 వేల కోట్లకు పైగా నిధులు నష్టపోయామని చెప్పడం విడ్డూరంగా ఉంది.

కూటమి ప్రభుత్వంలో పరిశ్రమల మూత

- వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జయకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న జయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): 'కూటమి నేతలు పరిశ్రమల వద్దకు వెళ్లి దందాలు చేయడం, కమీషన్ల కోసం బెదిరింపులకు పాల్పడటం వంటివి జరుగుతున్నాయి. దీంతో సదరు యజమానులు పరిశ్రమలను మూసేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కార్మికుల పరిస్థితి దారుణంగా మారింది' అని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.జయకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ కారణంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సెజ్‌లు ఏర్పాటై యువతకు ఉపాధి అవకాశాలు దక్కాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కూడా అనేక పరిశ్రమలు రావడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి లేదని, ఎక్కడ చూసినా అవినీతిమయమైపోయిందన్నారు. నెల్లూరు జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలిస్తున్నారన్నారు. దీంతో ఇసుక కొరత ఏర్పడి భవన నిర్మాణ కార్మికులకు పనుల్లే అనేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తలేదన్నారు. అంతేకాకుండా ఉన్న ఉద్యోగాలను తొలగిస్తూ అనేక కుటుంబాలను వీధిన పడేలా చేస్తోందని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇసుక మాఫియా, రౌడీయిజంపై ప్రశ్నించిన దాఖలాల్లేవన్నారు. ప్రజా సంక్షేమం గురించి పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో తమ యూనియన్ తరఫున పోరాటాలు చేస్తామన్నారు.

2027 నాటికి దగదర్తి ఎయిర్‌పోర్ట్ పూర్తి

- ఎంపీ వేమిరెడ్డి

కావలి: దగదర్తి విమానాశ్రయాన్ని 2027 నాటికి పూర్తి చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు కలెక్టర్ ఆనంద్, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులతో కలిసి విమానాశ్రయం నిర్మించే దామవరం వద్ద భూములను శుక్రవారం పరిశీలించారు. అధికారులతో ఎంపీ వేమిరెడ్డి చర్చించారు. రైతులకు సంబంధించి పరిహారం అంశంపై మాట్లాడుతూ 1,379 ఎకరాల్లో ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించాలని ప్లాన్ చేశారని, 669 ఎకరాలను ప్రభుత్వం సేకరించిందగా, మరో 710 ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. ఎయిర్‌పోర్ట్ స్థలం జాతీయ రహదారిని ఆనుకుని ఉందని, కార్గో, పాసింజర్ సేవలకు అవకాశం ఎక్కువ ఉందన్నారు. విమానాశ్రయానికి దగ్గరలోనే రెండు పోర్టులున్నందున ఎగుమతులు, దిగుమతులకు అనుకూలంగా ఉంటుందని, ఈ ప్రాంతం పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భూసేకరణకు రూ.96 కోట్ల నిధుల విడుదలకు సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారని చెప్పారు.

నర్సింగ్ కళాశాలలో 'ఆర్డర్లీ'



ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపకురాలు పెంచల లక్ష్మి ఆర్డర్లీ విధానానికి తెరతీశారు. నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలోని నర్సింగ్ కళాశాలలో చదివే ఓ విద్యార్థిని అధ్యాపకురాలికి గొడుగు పడుతున్న తీరును చూసిన జనం విస్తుపోయారు. పోలీస్ శాఖలో గతంలో ఆర్డర్లీ వ్యవస్థ నడుస్తుండేది. అలాంటిది నర్సింగ్ కళాశాల వద్ద శుక్రవారం కనిపించింది. ఇలా రోజూ విద్యార్థినులతో గొడుగు పట్టించుకుంటూ ఆమె కారు వద్దకు నడిచి వస్తోంది.

– నెల్లూరు(అర్బన్)